క్లుప్తంగా

కళ్లజోళ్ల పంపిణీ



14వ వార్డులో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

సామర్లకోట: కంటి పరీక్షలు చేసుకున్న వారికి శనివారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఇటీవల పట్టణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అనేక మందికి కంటి పరీక్షలు చేశారు. కంటి అద్దాలు అవసరమైన వారికి 14వ వార్డులో ఆ వార్డు కౌన్సిలరు స్వయంభారపు వీరభద్రరావు వాటిని పంపిణీ చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ



మహిళ మెడలో తెంచుకుపోతూ వదిలివెళ్లిన పుస్తెల తాడు

పెద్దాపురం: దైవ దర్శనానికి కాలినడకన వస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఘటన శనివారం ఉదయం పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పిఠాపురం మండలం విరవ గ్రామం నుంచి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి ఉదయాన్నే కాలినడకన వస్తున్న మహిళ మెడలో పుస్తెల తాడు, గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కుని వెళ్లారు. పక్కనే నడుస్తున్న మరో మహిళ వారిని అడ్డగించడంతో పుస్తెల తాడు మహిళ చేతిలో ఉంచి బంగారు గొలుసు పట్టుకుని వారు పరారైనట్టు స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

బస్సు ఢీకొని కాలువలోకి దూసుకెళ్లిన కారు



గోదావరి కాలువలోకి దూసుకుపోయిన కారు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులోని రైల్వే గేటు సమీపంలో కాకినాడ వెళుతున్న కారును వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు గోదావరి కాలువలోకి దూసుకు పోయింది. కారు డ్రైవరు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. కళాశాల బస్సు అతి వేగంగా రావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ సంఘటనతో సామర్లకోట–కాకినాడ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఏఎస్సై రత్నం తమ సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీరించారు. కారులోని ఇద్దరు ప్రయాణికులకు స్వల్పంగా గాయపడ్డారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఎక్కుతూ జారిపడి వ్యక్తికి గాయాలు



రైలు నుంచి జారిపడి గాయపడిన వ్యక్తి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో కాకినాడ నుంచి తిరుమల వెళుతున్న ఎక్స్‌ప్రెస్ ఎక్కుతూ జారిపడిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకుని క్షతగ్రాతుడిని 108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుని వివరాలు తెలియాల్సి ఉందని జీఆర్పీ ఎస్సై లోవరాజు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు పితృ వియోగం



స్వామి నాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి తండ్రి గంగిరెడ్డి స్వామినాయుడు (86) శనివారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్వామినాయుడు మృతి వార్త తెలుసుకున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, మున్సిపల్ వైస్‌చెర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు స్వామినాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే దొరబాబు
- వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ



వైఎస్సార్ ఆసరా చెక్ అందజేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతీఒక్కరూ ఎన్నికలకు సమాయత్తం కావాలని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక సురక్ష కన్వెన్షన్ హాలులో శనివారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వారిద్దరూ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ళపై తాము నిలబడి జీవనోపాధి పొందుతూ లక్షాధికారులు కావాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి కలకాలం ఉండాలని ఆకాంక్ష వెలిబుచ్చారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. అనంతరం మహిళలతో కలిసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ఇన్‌చార్జి ఏపీఎం ప్రియదర్శిని, మత్స్యకార మహిళా సమాఖ్య కోఆర్డినేటర్ శ్రీధర్, ఎంపీడీఓ వెంకట నారాయణ పాల్గొన్నారు.

మహిళలకు అండగా వైఎస్సార్ ఆసరా

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్న మాట తప్పకుండా మహిళలకు అండగా ఉండేందుకు వైఎస్సార్ ఆసరా పంపిణీ చేస్తున్నారని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత అన్నారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన పిఠాపురం మండల వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. క్రమం తప్పకుండా నాలుగు విడతలుగా మహిళలకు ఆసరా నిధులు విడుదల చేశారన్నారు. ప్రతి మహిళా ఆసరా రుణమాఫీ తన జీవనోపాధికి ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద పిఠాపురం మండలంలో 1600 మహిళా సంఘాలకు చెందిన 16,000 మంది లబ్ధిదారులకు రూ.13.51 కోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్దినీడి సుజాత, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నడిగట్ల చింతలరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు, ఉలవల భూషణం తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు

పిఠాపురం: క్రీడాకారులకు తగిన సౌకర్యాలు కల్పించి ప్రభుత్వం ప్రోత్సాహమిస్తుందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. పిఠాపురం రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూలు బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పిఠాపురం ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాదని ఇక్కడ అత్యంత ప్రతిభ గల క్రీడాకారులున్నారన్నారు. పిఠాపురం పట్టణంలో క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ క్రీడా స్థలాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, వగ్రపు వీరేష్, పచ్చిమళ్ల అప్పలరాజు, కొత్తపల్లి బుజ్జి, బాలిపల్లి రాంబాబు, పెదపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక శాఖాధికారి సత్యనారాయణ

పెద్దాపురం: కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందని పెద్దాపురం కార్మిక శాఖాధికారి సత్యనారాయణ అన్నారు. ఎలక్ట్రికల్ బల్బును కనిపెట్టిన థామస్ ఆల్వా ఎడిసన్ జయంతిని శనివారం పట్టణ ఎలక్ట్రికల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద సంఘ అధ్యక్షుడు తాడిశెట్టి గంగ జెండాను ఆవిష్కరించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్మిక శాఖాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ కార్మిక పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం యాసలపు సూర్యారావు భవనం నుంచి ఆర్బీ కొత్తూరు రోడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతికుమార్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైళ్లలో నిషేధిత సామగ్రి రవాణా నేరం



రైల్వే ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్న రైల్వే ఎస్సై

సామర్లకోట: రైల్వేలో నిషేధిత సామగ్రి రవాణా చేయడం చట్ట రీత్యా నేరమని రైల్వే ఎస్సై బి.లోవరాజు అన్నారు. శనివారం సాయంత్రం రైల్వే ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదేశాల మేరకు ప్రయాణికులకు సూచనలు ఇచ్చారు. రైల్వే స్టేషన్ పరిధిలో అనుమానిత వ్యక్తులు కనబడితే తక్షణమే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైల్వే ప్రయాణికుల బ్యాగులు, విలువైన వస్తువులు, సెల్ ఫోన్లు దొంగించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణికులతో కొంత మంది ప్రయాణం చేస్తూ మత్తు కలిపిన బిస్కెట్లు, కూల్ డ్రింక్స్, టీ వంటి పదార్థాలు ఇచ్చి ప్రయాణికుల వద్ద ఉన్న విలువైన సామగ్రిని రైళ్లలో దొంగిలిస్తున్నారని తెలిపారు. వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ.3.02 లక్షలు



భక్తుల నుంచి పూజలు అందుకుంటున్న తిరుపతి శృంగారవల్లభ స్వామి



స్వామి వారి దర్శనం కోసం ఆలయం లోపల, అన్నదానం వద్ద భక్తులు

భక్తులతో పోటెత్తిన ఆలయం

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఈ వారం వేల సంఖ్యలో స్వామి దర్శనానికి వచ్చారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి 03,02,286 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ నారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా సుమారు పదిహేను వేల మంది భక్తులు స్వామిని దర్శించుకోగా, భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

సామర్లకోట: రాష్ట్ర విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీ విభాగాలు 2024–25 సంవత్సరానికి ప్రతిపాదిత రిటైల్ సరఫరా ధరలపై సర్వే చేయనున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు ఈ మేరకు ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నట్టు డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎ.ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సబ్ సబ్ డివిజన్ కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 నిమిషాల వరకు ఈ సేకరణ జరుగుతుందని చెప్పారు. విద్యుత్తు వినియోగదారులు అధిక సంఖ్యలో పాల్గొన్ని తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఇతర వివరాలకు 83338 18099 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

పిఠాపురం: పట్టణంలోని కోటగుమ్మం సెంటర్ వద్ద ఉన్న కన్యకాపరమేశ్వరి సత్రంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గొల్లప్రోలు మండలం తాటిపర్తి శ్రీరామ్ అపర్ణా సేవా ట్రస్టు సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ జరిగే ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తామన్నారు. స్థానికులందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సిరుల జల్లు

- ఉద్యాన సాగులో మరిన్ని ప్రోత్సాహకాలు
- రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలు
- మెట్టలో పెరిగిన తోట పంటల విస్తీర్ణం
- ప్రభుత్వ సహకారంతో రైతుల్లో ఆసక్తి



బిందు సేద్యం యూనిట్లను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

పెద్దాపురం: మెట్ట రైతాంగం ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపుతోంది. తక్కువ నీటి వనరులతో లాభదాయకంగా ఉండడంతో రైతులు బిందు, తుంపర సేద్యాలను అవలంబిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో వీటి ఏర్పాటుకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా 50 నుంచి 90 శాతం రాయితీలు అందిస్తోంది. దీంతో మెట్ట ప్రాంత రైతులు బిందు, తుంపర సేద్యాలపై మొగ్గుచూపుతున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో సాధారణ పంట ప్రధానంగా వరి సుమారు 45 వేల ఎకరాల్లో సాగవుతోంది. పెద్దాపురంలో 19 వేల ఎకరాలు, సామర్లకోటలో సుమారు 25 వేల ఎకరాల్లో సాధారణ పంటలు పండిస్తున్నారు. ఉద్యాన శాఖకు సంబంధించి పెద్దాపురంలో సుమారు 9,500 ఎకరాల్లోనూ, సామర్లకోటలో సుమారు రెండు వేల ఎకరాల్లోను, వెరసి నియోజకవర్గంలో 11,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

బిందుసేద్యంతో ఉద్యానవన తోటలు

మెట్టలో ప్రధానంగా మామిడి, జీడిమామిడి, కొబ్బరి, జామ, పామాయిల్, సపోటా, అరటి తోటల సాగుకు బిందు సేద్యం అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు బిందుసేద్యం యూనిట్లను ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా రాయితీపై అందజేస్తోంది. బిందుసేద్యం ద్వారా చెట్టు, తల్లివేరుకు అవసరమైన నీటిని అందిస్తారు. ఈ నీటిని వృథా కాకుండా తక్కువ నీటితో అధిక దిగబడులు సాధించవచ్చు.

రాయితీ పరికరాలకు అర్హతలివే..

ఐదెకరాల లోపు ఉన్న అన్ని కులాల రైతులకు 90 శాతం రాయితీపై ప్రభుత్వం డ్రిప్ పరికరాలు మంజూరు చేస్తోంది. రైతు పది శాతం వాటాను భరించాలి. ఐదెకరాల కంటే పైబడిన రైతులకు 50 శాతం రాయితీ వర్తిస్తుంది. రైతు మిగిలిన శాతాన్ని భరించాల్సి ఉంటుంది. బిందుసేద్యం పైపుల సంఖ్య, వ్యవసాయ క్షేత్రంలో బోరు ఉన్న ప్రదేశం ఆధారంగా ఫీల్డ్ అధికారి యూనిట్ విలువను నిర్ణయిస్తారు. ఈ యూనిట్ కావాల్సిన రైతుల పొలంలో కచ్చితంగా వ్యవసాయ బోరు ఉండాలి. భూ యజమాని ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, 1బి ఫారం, ఎఫ్ఎంబి ఫారం, ఫోన్ నంబర్ వివరాలతో సచివాలయంలో ఉద్యాన శాఖ సహాయకులను సంప్రదించాలి.



తుంపర సేద్యంలో సాగవుతున్న పంట

తుంపర సేద్యంతో పూల సాగు

మెట్ట ప్రాంతంలోని గ్రామీణ ప్రాంత రైతులు కొద్దిపాటి విస్తీర్ణంలో పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు, పూల సాగు చేస్తుంటారు. ఈ సాగుకు తుంపర సేద్యం ఎంతో అనుకూలంగా ఉంటుంది. చిన్న రైతులు వేసే బంతి, చామంతి, గులాబి తదితర పూల సాగుతో పాటు తోట కూర, కొత్తిమీర, బెండ, వంగ, బీర, టమాటా, ఆనపకాయ వంటి కూరగాయల సాగుకు తుంపర సేద్యం అనుకూలమని జిల్లా అధికారులు చెబుతున్నారు. దీనికి గాను ప్రభుత్వం ఐదెకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 55 శాతం రాయితీపై తుంపర సేద్యం యూనిట్లను అందజేస్తోంది. ఐదెకరాల కంటే పైబడిన రైతులకు 45 శాతం రాయితీ అందిస్తోంది.

రూ.50 వేల రాయితీ వచ్చింది



నాకున్న మూడెకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నాను. బిందు సేద్యం యూనిట్ ధర రూ.1,02,803 కాగా, రాయితీ రూ.50,412 లభించింది. రైతు వాటాగా రూ.58,559 చెల్లించాను. దీంతో బిందుసేద్యం యూనిట్, పైపులైన్ ఏర్పాటు చేశారు. గతంలో బోరు సాయంతో సాగు చేసేవాడిని. ఇప్పుడు బిందు సేద్యంతో పామాయిల్ చెట్లకు నీరు సమృద్ధిగా అందుతోంది.

– బొడ్డు శ్రీనివాస్, పామాయిల్ రైతు, ఆర్‌బీ పట్నం

మెట్ట రైతుకు ఎంతో మేలు



మెట్ట ప్రాంతమైన ఆర్‌బీ కొత్తూరు, ఆర్‌బీ పట్నం, చిన బ్రహ్మదేవం, వాలుతిమ్మాపురం, ఆనూరు, కొండపల్లి, కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాల రైతులకు బిందు, తుంపర సేద్యంతో ఎంతో మేలు చేకూరుతోంది. ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతో రైతులు ఈ పద్ధతిని అవలంబిస్తున్నారు. ఆయా గ్రామాల్లో బిందు, తుంపర సేద్యానికి దాదాపు 130 మంది రైతులు రాయితీపై యూనిట్లు పొందారు. ఆసక్తి కల్గిన రైతులు ఆర్‌బీకేల్లో వీహెచ్‌లను సంప్రదిస్తే, మరిన్ని యూనిట్ల మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

– మాదబోయిన చిలకమ్మ, వీహెచ్ఏ, రాయభూపాలపట్నం

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా



వాలీబాల్ క్రీడాకారులను అభినందిస్తున్న నాయకులు

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడానికే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించిందని సర్పంచ్ శీలం పెద అప్పారావు అన్నారు. నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మహిళా క్రీడాకారులను శనివారం ఆయన అభినందించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని ఆకాంక్ష వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుండ్ర చిన్నారావు, ఎంపీటీసీ బర్రే రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై దాడులు



రామేశంమెట్టపై తనిఖీలు నిర్వహిస్తున్న రెవెన్యూ, మైన్స్ అధికారులు

పెద్దాపురం: మండలంలోని ఆనూరు రామేశంమెట్టపై జరుగుతున్న అక్రమ గ్రావెల్ తరలింపుపై శనివారం మైన్స్, రెవెన్యూ అధికారులు అకస్మిక దాడులు జరిపారు. మైనింగ్ శాఖ ఆర్ఐ, తహసీల్దార్ వి.జితేంద్రల ఆధ్వర్యంలో ఇటీవల అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి 13 లారీలు, రెండు జేసీబీలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ గ్రావెల్ తరలిస్తున్న వాహనాలకు అపరాధ రుసుము విధించి కేసు నమోదు చేస్తున్నట్టు దర్యాప్తు అధికారులు తెలిపారు.

శ్మశాన వాటికలో కుళాయిల ఏర్పాటు



గొంచాల గ్రామంలోని శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన కుళాయిలు

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామంలోని శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన కుళాయిలను శనివారం ప్రారంభించారు. అముజాల లక్ష్మణరావు, రామమణి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు అముజాల దొరబాబు వాటిని ఏర్పాటు చేసి ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



తుని పట్టణంలో రోడ్డు భద్రతపై ర్యాలీ చేస్తున్న పోలీసులు

తుని: రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) బి.శ్రీనివాస్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో 500 మంది విద్యార్థులతో రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్, సీటుబెల్టు ధరించకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం కలిగే అనర్థాలపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే పదేళ్లలో రోడ్డు ప్రమాదాలను 50 శాతం తగ్గించడమే లక్ష్యంగా రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై రామలింగేశ్వరరావు, పోలీసు, ఆర్టీఓ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం బహూకరణ

కోటనందూరు: స్థానిక అల్లూరి సీతారామరాజు సేవా కమిటీకి విశాఖపట్నానికి చెందిన దాత సరసా రాజబాబు రూ.1.5 లక్షల విలువ చేసే వాహనాన్ని బహూకరించారు. కోటనందూరులో శనివారం సేవా కమిటీ సభ్యులకు దాత రాజబాబు వాహనాన్ని అందజేశారు. వాహనాన్ని వినియోగించి ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. దాత ఔదార్యం పట్ల సంస్థ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దాడి చెల్లారావు, నరసా సాయి, దాడి శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకార సేవ

అన్నవరం: రత్నగిరిపై శనివారం సత్యదేవుని ప్రాకారసేవ ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి ఊరేగింపుగా తూర్పురాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రాలు, బాజాభజంత్రీల నడుమ స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద మూడు సార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అనంతరం పూజలు చేసి స్వామి, అమ్మవార్లను తిరిగి ప్రధానాలయానికి చేర్చారు. కార్యక్రమంలో అర్చకుడు శ్రీకాకుళపు వరదయ్య, దేవస్థానం సూపరింటిండెంట్ స్వామీజీ పాల్గొన్నారు.